
శ్రీనివాసకల్యాణము (సచిత్రకథ)

(వేంకటాచలమాహాత్మ్యము)



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీనివాసకల్యాణము

(వేంకటాచలమాహాత్మ్యము)

సచిత్రకథ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2019

SRINIVASA KALYANAM

(VENKATACHALA MAHATMYAM)

(Illustrated)

T.T.D. Religious Publications Series No.1081
All Rights Reserved

Special Officer

Dr. Talluri Anjaneyulu

First Edition : 1974
Second Edition : 2014
Re-print : **2019**

Copies :

Published by :
ANIL KUMAR SINGHAL, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division
T.T.D., Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ఒకమాట

శ్రీవేంకటాచలమాహాత్మ్యమునందలి ఇతివృత్తాన్ని కథాంశంగా స్వీకరించి **శ్రీనివాసకల్యాణము** అనే పేరుతో మలచిన సచిత్ర కథాకావ్యమిది. విషయబోధనకు, కథనంతోబాటు చిత్రాల జోడింపు పాఠకునికి ఆసక్తి కలిగించి చదివింపజేస్తుంది. సన్నివేశాలకు అనుగుణంగా దాదాపు 51 చిత్రాలు పుస్తకంలో ఒకదానితో ఒకటి పోటీపడే విధంగా చిత్రించారు చిత్రకారులు.

గతంలో ముద్రించిన ప్రతులు చెల్లిపోయిన కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు యీ సచిత్ర కావ్యాన్ని ఇప్పుడు పునర్ముద్రిస్తున్నారు.

ఈ సచిత్ర కథాకావ్యం తెలుగులోనే కాకుండా తమిళ కన్నడ హిందీ భాషలలో గతంలో ముద్రించారు.

భక్తులు పాఠకులు సహృదయులు యీ సచిత్రకావ్యాన్ని చూసి, చదివి ఆనందనిలయుని ఆశీస్సులు పొందుతారని ఆశిస్తూ...

సదా శ్రీవారి సేవలో...


కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి


శ్రీనివాసకల్యాణము

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీనివాసుడు. శ్రీనివాసకల్యాణం సమస్తలోకానికి మంగళకరం. సర్వజనులకు ఆనందకరం. అద్భుతమైన చిత్రాలతో చక్కని కథనంతో స్వామి వివాహ ఘట్టాన్ని కనులెదుట సాక్షాత్కరింపచేసే రచన.

శ్రీలక్ష్మి వైకుంఠాన్ని వదిలి భూలోకానికి వెళ్ళడం, శ్రీమహావిష్ణువు సతి ఎడబాటు సహింపలేక వేంకటగిరికి వేంచేయడం, అక్కడే నివాసం ఏర్పరచుకొనడం, తదనంతరం పద్మావతిని దర్శించడం, వకుళాదేవి సహాయంతో వారి వివాహం జరగడం ఇందలి ఇతివృత్తం.

తిరుమలశ్రీవారికల్యాణాన్ని కనులారా వీక్షింపజేస్తున్న కనువిందైన వర్ణచిత్రాలతో పాటు, వాటిని వర్ణిస్తున్న కమ్మనైన రచనను చదవండి... చదివించండి... ఆనందించండి !






శ్రీవేంకటాచలమాహాత్మ్యము

(శ్రీనివాసకల్యాణము)


కలియుగంలో జనులకష్టాలు బాపి, భవబంధాలు తెంచి ఉద్ధరించుటకై, త్రిలోకనాథుడైన మహావిష్ణువు దివి నుండి భువికి దిగివచ్చి వేంకటాచలవాసియై, ఆకాశరాజుపుత్రి, పద్మసంభవి అయిన పద్మావతీదేవిని పరిణయమాడిన పవిత్రగాథ సచిత్రవ్యాఖ్యానంగా సమర్పిస్తున్నాము.

శ్రీనివాస కల్యాణము



ARTISTS C.NATARAJA PILLAI
S.VEERAIAH, T.V.R



గంగానదీ తీరంలో, కశ్యపప్రజాపతి పర్యవేక్షణలో సమస్త ఋషులుచేరి
ఒక యాగం ప్రారంభించారు. ఆ యాగం చూసేవేడుకతో వచ్చిన
నారదముని ఎందుకొర కీయజ్ఞం? దీనివలన ఎవరికి సంతృప్తి అవుతుంది?
ఈయాగ ఫలాన్ని ఎవరికి సమర్పించబోతున్నారు? అని ప్రశ్నించాడు.



నారదుని ప్రశ్నకు సమాధాన మివ్వలేని ఋషివర్యులు,
దానిని పరిష్కరించమని భృగువును ప్రార్థించారు. స్వయంగా దర్శించి,
నిర్ణయించేందుకు భృగుమహర్షి మొదటగా సత్యలోకానికి సాగిపోయాడు.




సరస్వతీ సహితుడై, నాల్గుమోముల నారాయణ కీర్తనం, వేదపఠనం
చేస్తున్న విరించి, తనరాకను గమనించనందువల్ల కోపించిన
భృగువు, అతనిని అనర్హుడని నిర్ణయించి కైలాసానికి కదలిపోయాడు.



అర్ధాంగిఅయిన అద్రితనయతో ఆనందంలో వున్న
ఆ పరమేశ్వరుడుకూడా మహర్షిని గమనించి మన్నింపలేదు.
పార్వతిమాత్రం పతిదృష్టిని మహర్షిపై మరలించింది.




ఆనందానికి అడ్డుగా వచ్చిన మహర్షిని చూచి మహేశ్వరుడు
మసిచేయ సంకల్పింపగా, పార్వతి పతికి అడ్డుపడింది.
మహేశ్వరుని శపించి, మహర్షి వైకుంఠుని దర్శనానికి వెళ్ళిపోయాడు.




శేషపర్యంకంపై శ్రీదేవి పాదములొత్తగా పవళించిన
ఆ నారాయణుడుకూడా తనరాకను గమనించనందుకు కుపితుడైన మహర్షి,
మహాలక్ష్మి మక్కువతో నివసించు విష్ణు వక్షస్థలంపై పాదంతో కొట్టాడు.



కుపితుడైన మునిని క్రోధం వదలి, క్షమింపమని ప్రార్థిస్తూ శ్రీమహావిష్ణువు మునిపాదాలు ఒత్తునెపంతో, మునికి దేవతలను కూడా ధిక్కరించు సామర్థ్యం కలిగి, అరికాలనున్న అద్భుతనేత్రమును అణచివేశాడు. అహంకారముడిగిన మహర్షి మహావిష్ణువే పూజనీయుడని నిర్ధారించగా, మునులందరు మహావిష్ణువుకే యజ్ఞఫలాన్ని సమర్పించారు.



అహంకరించి, అసభ్యంగా ప్రవర్తించిన మహర్షిని, మన్నింపమని కోరిన
విష్ణువును చూచి మహాలక్ష్మి కోపగించినదై, నాథు డర్థించినను
నిర్లక్ష్యం చేసి వైకుంఠాన్ని వదలి వెళ్లింది.




శ్వేతవరాహకల్ప ప్రారంభంలో సమస్తం జలమయమై భూమికూడా
నీటిలో మునిగిపోయింది. మహావిష్ణువు శ్వేతవరాహరూపంతో తన నెదిరించిన
హిరణ్యాక్షుడనే రాక్షసుని వధించి ధరణిని (భూమిని) పైకెత్తి రక్షించాడు.




భూదేవినుద్ధరించిన ఆదివరాహమూర్తిని స్తుతించి, బ్రహ్మాదిదేవతలు పుష్పవృష్టి కురిపించారు. దుష్టులను దునుమాడి, శిష్టులను సంరక్షిస్తూ, ఆదినారాయణుడు శ్వేతవరాహమూర్తిగా ఇలపై నిలిచినందువల్ల ఈ క్షేత్రం వరాహక్షేత్రం అయ్యింది. అప్పటినుండే శ్వేతవరాహకల్పం ప్రారంభమయ్యింది.




మహాలక్ష్మి వైకుంఠాన్ని వీడిపోగా, ఏకాకి అయిన మహావిష్ణువు
వైకుంఠాన్ని వదలి, వేంకటగిరికి చేరుకొన్నాడు.
అక్కడ పుష్కరిణి పక్కన ఒక చింతచెట్టు క్రింద పుట్టలో నివాసమేర్పరచుకొన్నాడు.




వైకుంఠవాసుని ఈ అవస్థకు చింతించిన
బ్రహ్మ, మహేశ్వరులు ఆవు, లేగదూడలుగా మారి
మహావిష్ణువును సేవించదలచుకున్నారు.




ఈ వివరాలన్ని సూర్యభగవానుడు
శ్రీమహాలక్ష్మికి విన్నవించి, ఆ ఆవును, లేగను
గొల్లెత రూపంలో వెళ్ళి, చోళభూపాలునకు విక్రయించమని కోరాడు.



ఆ ఆవును, దూడను స్వీకరించిన చోళభూపతి, వానిని తన పశువుల మందతోపాటు మేతకై వేంకటగిరికి పంపాడు. పుట్టలో నివసిస్తున్న పరమాత్మను చూచిన ఆ గోవు, ప్రతిరోజు పుట్టలో పాలను కురిపిస్తూ భగవానుని తృప్తిపరచింది.



ఇంట్లో గోవు పాలు ఇవ్వనందువల్ల
చోళరాణి పసుల కాపరిని
తీవ్రంగ దండించింది.




ఆ గోవు పాలు ఇవ్వని కారణం కనుగొనేందుకు
కాపరి ఆవును వెంబడించి, పుట్టలో
పాలు వర్షించడం చెట్టుచాటుగా చూచాడు.




ఆవుపై ఆగ్రహించిన ఆలకాపరి,
గొడ్డలితో కొట్టబోగా దానిని రక్షించేందుకు పైకివచ్చిన
శ్రీనివాసునకు ఆ గొడ్డలి తగిలి గాయమైంది.




గొడ్డలి వేటుతో, రక్తం కారుతున్న
భగవానుని చూచి, పసులకాపరి నేలపై
పడి ప్రాణాలు విడిచాడు.




పసులకాపరి మరణించగా, రక్తసిక్తమైన శరీరంతో
ఆ ఆవు చోళనగరానికి వచ్చింది. ఆవుపైన గాయాలను చూచిన చోళరాజు
కారణం తెలుసుకునేందుకు ఆవును వెన్నంటి వచ్చాడు.




పుట్టప్రక్కన వున్న పసులకాపరి శవాన్ని చూచి, రాజు ఆశ్చర్యపోయాడు, ఇంతలో శ్రీనివాసుడు పుట్టపైకి వచ్చి, సేవకుని తప్పునకు రాజును రాక్షసుడుకమ్మని శపించాడు. తనవలన అపరాధమేమీ లేదని రాజువేడుకోగా కరుణించి తాను ఆకాశరాజిచ్చు కిరీటం ధరించి, పద్మావతిని పరిణయమాడువేళ శాపవిమోచనమయ్యేట్లు అనుగ్రహించాడు.




అప్పటినుండి శ్రీనివాసుడు ఆ వరాహ క్షేత్రంలో నివసించేందుకు తగిన స్థలాన్ని వరాహమూర్తి అనుగ్రహించాడు. అందుకు ప్రతిఫలంగా శ్రీనివాసుడు, ప్రతిరోజు ముందుగా ఆదివరాహస్వామికి పూజానివేదనలు జరగాలని, భక్తులు కూడ పుష్కరిణిలో స్నానం చేసి, తొలుత వరాహస్వామిని దర్శించిన తర్వాత తనను దర్శిస్తే యాత్ర ఫలప్రదం అవుతుందని కట్టడి చేశాడు.




దేవకీసుతుడైన కృష్ణభగవానుని, యశోద పెంచి పెద్దచేసింది. కానీ రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణం చూడలేకపోయింది. మరుజన్మలో ఆమె వకుళమాలిక కాగా, తాను శ్రీనివాసుడిగా ఆమె కోర్కె తీరుస్తానని కృష్ణుడు వరమిచ్చాడు. వరాహస్వామి తన సేవలో ఉన్న వకుళమాలికను, శ్రీనివాసుని సేవించుటకు నియమించాడు.




చాలకాలం గడచింది. చంద్రవంశజుడైన ఆకాశరాజు తొండమండలాన్ని పాలించేవాడు. ఆతనికి తొండమానుడను తమ్ముడు ఉండేవాడు. సంతానం లేనందువల్ల ఆకాశరాజు సంతానంకొరకు ఒక యాగం చేయ తలపెట్టాడు. దానికోసం భూమిని దున్నుచుండగా నాగేటికొనకు తగులుకొని బంగారుపద్మం బయటపడింది. అందులో అందాలపాప ఉన్నది.




యాగం ఆరంభించకుండానే శిశువు లభించినందులకు
రాజు సంతోషించాడు. ఇంతలో 'ఓ రాజా! ఈ బాలను భద్రంగా పెంచు
నీకు శుభంకలుగుతుంద'ని ఆకాశవాణి పలికింది. పద్మంలో
కనిపించినందువల్ల ఆ రాజు ఆ బాలను పద్మావతిపేరుతో పెంచాడు.




కాలక్రమంగా పద్మావతి పెరిగి సౌందర్యవతి అయిన కన్య అయింది.
ఒకనాడు నారదమహర్షి వచ్చి, తానామెకు హితం చేసేవాడనని,
ఆమె హస్తరేఖలు చూచి శ్రీమహావిష్ణువుకు ఆమె దేవికాగలదని పలికాడు.



ఈ సమయంలో వేట నెపంతో శ్రీనివాసుడు
ఒక మదపుటేనుగును తరుముతూ ఆ ప్రాంతానికి వచ్చాడు.
ఆ ఏనుగాతనిని పద్మావతి విహరిస్తున్న ఉద్యానవనానికి తీసుకొని వచ్చింది.
ఏనుగును చూచినంతనె రాకుమార్తె, చెలులు భయపడ్డారు.




ఆ ఏనుగు వెంటనే శ్రీనివాసునికి నమస్కరించి,
అడవిలో అదృశ్యమైపోయింది. శ్రీనివాసుడు అశ్వమధిరోహించి
రాగా, భయభ్రాంతలైన పద్మావతి చెలులు ఆతనిపై ప్రశ్నల వర్షం కురిపించారు.



తన పుట్టు పూర్వోత్తరాలు
చెప్పుకొన్న శ్రీనివాసుడు, పద్మావతిగూర్చి
వివరాలు అడిగాడు.




కమలజాతయైన ఆమె ఆకాశరాజు పెంపుడు పుత్రిక పద్మావతి అని చెలులు చెప్పగా
సంతోషించి, తానామెను ప్రేమించానని, పెళ్ళాడుతానని శ్రీనివాసుడు
ముందడుగు వేశాడు. చెలులు, రాళ్ళు విసరి ఆతని నిరోధించారు. క్రిందపడిన
అశ్వాన్ని వదలి శ్రీనివాసుడు సత్వరమే శేషాద్రిని చేరాడు.



ఎప్పటివలెనే, శ్రీనివాసునకు వివిధ భక్ష్యములతో, వకుళమాలిక భోజనం పెట్టింది.
మనోవేదనతో వున్న శ్రీనివాసుని చూచి కారణమడిగింది. అందుకాతడు
పద్మావతిని పరిణయమాడనిదే తనకు ఉపశమనం లేదని తెలిపాడు. వకుళమాలిక పద్మావతి
జన్మదినాన్ని, శ్రీనివాసుడు ప్రేమించిన సందర్భాన్ని గూర్చి వివరాలు అడిగింది. అందుకు
శ్రీనివాసుడు వకుళమాలికకు పద్మావతీ పూర్వజన్మను గూర్చి ఇలా వివరించాడు.




పూర్వం లక్ష్మీదేవి , వేదవతి రూపంలో మునిఆశ్రమంలో
నివసిస్తుండేది. అదే సమయంలో లంకేశుడైన రావణుడువచ్చి ఆమెను
ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించాడు. అందుకు ఆగ్రహించిన వేదవతి
ఆతని మరణానికి తానే (లక్ష్మి) కారణమవుతానని శపించింది.




రావణుడు వెళ్ళిపోయిన వెంటనే వేదవతి,
అగ్ని ప్రవేశం చేసింది. కాని అగ్నిదేవుడామెను రక్షించి
జాగ్రత్తగా కాపాడమని భార్యకప్పగించాడు.




పంచవటిలోనున్న సీతను రామలక్ష్మణులు లేని సమయంలో రావణుడు
అపహరించేందుకు ప్రయత్నించినపుడు, ఆమెను కాపాడేందుకు
అగ్నిదేవుడు సీతకు బదులు వేదవతినే సీతగా రావణునికి అప్పగించాడు.




వేదవతినే అసలు సీతగా భావించి, రావణుడామెను
లంకకు తీసుకుపోయాడు. అసలు సీతను,
అగ్నిదేవుడు తన ఇంట్లోఉంచి రక్షించుటకు స్వాహాదేవికి అప్పగించాడు.




రావణ వధానంతరం, రామునిచే తిరస్కరింపబడిన వేదవతి అగ్నిప్రవేశం
చేసింది. అప్పుడు అగ్నిదేవుడు నిజమైన సీతనుకూడా తీసుకొనివచ్చి
రామునకు అప్పగించాడు. ఆ రెండవయామె ఎవరని రాముడు సీతను ప్రశ్నించాడు.




అప్పుడు సీతాదేవి, తనకు మారుగ లంకలో బాధలుపడినది ఈ వేదవతియేనని తెల్పి
ఆమెనుకూడ స్వీకరించమని రాముని ప్రార్థించింది. ఏకపత్నీవ్రతుడైన రాముడు
ఆ జన్మలో అది జరగదని, మరుజన్మలో ఆమె పద్మావతిగా ఆకాశరాజు కుమార్తెగా
అవతరించినప్పుడు, తాను శ్రీనివాసుడై చేపట్టగలనని వాగ్దానంచేశాడు.




ఇదివిన్న వకుళమాలిక పద్మావతిని పరిణయమాడనిదే శ్రీనివాసునకు సుఖం లేదని తెలిసి,
ఆకాశరాజు ధరణీదేవిలతో పెండ్లిరాయబారంచేయడానికి బయల్దేరింది.
మార్గమధ్యంలో ఆమె శివాలయంనుండివస్తున్న చెలులనుచూచి, పద్మావతి కూడా
శ్రీనివాసునిపై విరహంతో వేగుచున్నట్లు తెలుసుకుని, వారివెంట అంతఃపురానికి వెళ్ళింది.




ఆకాశరాజు, ఆయనభార్య కుమార్తె ఆరోగ్యంగూర్చి ఆందోళన
చెందారు. వేంకటనగంపైఉండే శ్రీనివాసునిపై ఆమె మరులుగొన్నట్లు విని
ఆకాశరాజు ఈ సంబంధం గూర్చి బృహస్పతితో చర్చించాడు.
అన్నివిధాల యోగ్యమైన సంబంధమేనని నిర్ణయించుకొన్నాడు.




వకుళమాలిక వెళ్ళిన కార్యం సిద్ధిస్తుందా అన్న సందేహం శ్రీనివాసునకు కలిగింది.
వెంటనే శ్రీనివాసుడు ఎఱుకలసాని వేషాన్ని ధరించి సాముద్రికం సోదె చెబుతూ,
రాజవీధులలో తిరుగాడసాగాడు. పద్మావతి చెలులీమెను చూచి,
తమరాణివద్దకు తోడ్కొనిపోవాలని భావించారు.



ఆహ్వానం లేనిదే అంతఃపురంలోనికి రావడానికి
ఎఱుకలసాని వెనకాడుచున్నదని
వారు రాణికి విన్నవించారు.




ఆ మాట విన్నంతనే మహారాణి స్వయంగా
ఎఱుకలసానిని ఆహ్వానించింది.
ఎఱుకలసానిని పద్మావతి దగ్గరకు తీసుకెళ్ళారు.




ఎఱుకలసాని పద్మావతి చేతిరేఖలు చూచింది. రాకుమార్తె అస్వస్థతకు కారణం
తెలిపి, ఆమెను శ్రీనివాసునకిచ్చి వివాహం చేయవలసిందిగా రాణికి
సూచించింది. శ్రీనివాసునితో పద్మావతీపరిణయాన్ని గూర్చి శ్రీనివాసుని
పక్షాన అర్థించుట కొరకు త్వరలో ఒకావిడ రానున్నట్లుకూడ తెలియజేసింది.




ఎఱుకలసాని వెళ్ళిపోయిన అనంతరం, వకుళమాలిక రాణివద్దకు
వచ్చి తాను శ్రీనివాసునివద్ద నుండి వచ్చినట్లు తెల్పి, ఆయనకు
పద్మావతి నీయవలసినదిగా అర్థించింది.




బృహస్పతితో సంప్రదించిన ఆకాశరాజు, ఎఱుకలసాని జోస్యాన్ని; శ్రీనివాసుని నుండి రాయబారి ఆగమనాన్ని విని, పద్మావతిని శ్రీనివాసునకిచ్చి వివాహం జరిపించుటే మంచిదని నిర్ణయించుకొన్నాడు. ముహూర్తం నిర్ణయించమని దైవజ్ఞులను పిలిపించాడు.




పద్మావతీ శ్రీనివాసులకు వివాహంచేసే సంకల్పాన్ని మహారాజు
సభలో వెల్లడించగా ఆ క్షణమే, పద్మావతిని వివాహమాడవలసినదని
కోరుతూ శ్రీనివాసునకు పంపుటకు దైవజ్ఞులు ఆహ్వాన పత్రికను సిద్ధంచేశారు.




ఆకాశరాజు ఈ సందేశం తీసుకొనిపోవుటకు శుకమహర్షిని అర్థించాడు. ఆయన వకుళమాలికతో వేంకటగిరికి వెళ్ళి, శ్రీనివాసుని దర్శించి పత్రికనిచ్చాడు. ప్రీతుడైన శ్రీనివాసుడు, శుకమహర్షిద్వారా కంఠమాలను బహుమతిగా పద్మావతికి పంపించాడు.




శ్రీనివాసుడు వెనువెంటనే,
బ్రహ్మాగ్నిరుద్రగణేశాది దేవతలతో మంతనం జరిపి,
వారి సమ్మతిని పొందాడు.




కల్యాణానికి కావలసిన ధనాన్ని
ధనపతి అయిన కుబేరు డప్పగించాడు.



బ్రహ్మరుద్రాది దేవతలు, దేవేరులు, తన వాహనమైన గరుత్మంతుడు వెంటరాగా
దివ్యవైభవంతో శ్రీనివాసుడు ఆకాశరాజుభవనానికి తరలివెళ్ళాడు.



వరరత్నమైన శ్రీనివాసుని, ఆకాశరాజు
సకలమర్యాదలతో ఆహ్వానించి భద్రగజంపై ఊరేగిస్తూ
నగరప్రవేశం చేయించాడు.



ముక్కోటి దేవతల సమక్షంలో శ్రీనివాసుడు పద్మావతిని
పరిణయమాడి, ఆకాశరాజును ఆశీర్వదించాడు.
శ్రీపద్మావతీ శ్రీనివాసుల కల్యాణం జగత్కల్యాణ కారకం!

శ్రియఃకాంతాయ కల్యాణనిధయే నిధయేర్థినామ్।
శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్॥